# సాగుకు అందని సాయం

- ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- పీఎం కిసాన్ మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందని సాయం
- అమలుకు నోచుకోని హామీలు
- అన్నదాతలు అప్పులు చేయాల్సిన పరిస్థితి


రాగిమాన్‌దొడ్డి గ్రామం ఉల్లినారును నాటుతున్న కూలీలు


హనుమాపురం గ్రామ సమీపంలో పత్తి పంటలో జెంతి పడుతున్న రైతులు

పెద్దకడబూరు : ఖరీఫ్ సీజన్ పనులు ఊపందుకుంటున్న సమయం.. పెట్టుబడి సాయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో ముందుస్తుగా వర్షాలు రావడంతో రైతులు తమ పొలాలను విత్తనానికి సిద్ధం చేసుకునే పనిలో ఉండగా కొంత మంది విత్తనాలు కూడా వేస్తున్నారు. పొలాలలో దుక్కి దున్నుకోవడం, నారు మడుల తయారీకి, విత్తనాల కొనుగోలు తదితర అవసరాల నిమిత్తం రైతులకు నగదు అవసరం. అయితే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమయానికి పెట్టుబడి సాయం అందించేదని అన్నదాతలు గుర్తుచేసుకుంటున్నారు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందేది. పీఎం కిసాన్ పథకం కింద రూ. 6వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 7,500 కలిపి సంవత్సరానికి రూ. 13,500ను మూడు విడతల్లో రైతుల ఖాతాలో జమ చేసేది. ఖరీఫ్ ప్రారంభంలోనే రూ. 7,500, పంట కోత సమయంలో రూ. 4వేలు, అనంతరం రూ. 2వేలు అందించేవారు. ఈ సాయం రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడేది. కౌలు రైతులకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా కలిగించి ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకుంది.

**సాగు పనులు ప్రారంభం**

మండలంలో 12,770 మంది రైతులు ఉండగా 33,650 ఎకరాల సాగుభూమి ఉంది. ఇందులో ఎక్కువగా పత్తి, ఉల్లి వంటి పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ఇప్పటికే సాగు చేసుకున్న పంటల్లో కలుపు తీయడం, ఎరువులు చల్లుకోవడం, మందులు కొట్టడం వంటి పనులు చేసుకుంటున్నారు. ఇంకొందరు ఎరువులు, విత్తనాలు కొనుగోలుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులకు పెద్ద సవాల్‌గా మారింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనాలంటే ఆర్థిక భారంతో రైతులు సతమతమవుతున్నారు.

**పేరుమార్పుతో సరి...**

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు అందిస్తామని ఆశ చూపింది. రైతులు ఎంతో ఆశ పెట్టుకున్నారు. అయితే నేటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో రైతులను కలవరానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చిందే తప్ప ఎటువంటి సహాయం అందించలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

**అప్పులు చేసి సాగుచేసుకుంటున్నాం**

నాకు 6ఎకరాల పొలం ఉంది. ముందస్తు వర్షాలు రావడంతో పత్తి నాటుకున్నా. పొలం సిద్ధం చేసుకోవడంతో పాటు విత్తనాలు, కూలీలలకు ఇప్పటికే రూ.లక్షకు పైగా అప్పుచేశా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు రైతు భరోసాతో ఆసరాగా ఉండేది. ఈ ప్రభుత్వం ఆసరా లేదుకదా కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. గత సంవత్సరం మిరప వేసుకొని మొత్తం నాశనం అయ్యాం.

– మోహన్‌రెడ్డి, జాలవాడి గ్రామం, పెద్దకడబూరు

**ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలి**



ఎన్నికల ముందు కూటమి నాయకులు అన్నదాతలకు అంత ఇస్తాము.. ఇంత ఇస్తాము అని ఊదరగొట్టుడు మాటలు చెప్పి తీరా అవసరము ఉన్నప్పుడు రైతుల గురించి ఒక్క మాటకూడా మాట్లాడకపోవడం దారుణం.విత్తనాలు,ఎరువులు తదితర సాగుకు అవసరమైనవి కొనుగోలు చేయడానికి రైతులు వారి భార్య తాళిని కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధమవుతున్నా..ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. వీలైనంత త్వరగా రైతులకు పెట్టుబడిసాయాన్ని అందించి ఆదుకోవాలి.

– తిక్కన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

## క్లుప్తంగా

### ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ఆలయ నిర్వాహకులకు రూ.లక్ష నగదును విరాళంగా అందజేస్తున్న దాతలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులో వెలిసిన శ్రీ కోట చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన హనుమంతు, ఆయన కుమారుడు తిరుమల రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం నగదును ఆలయ నిర్వాహకులు రవి, గోవిందు, గిరిస్వాములకు అందించారు. ఈ సందర్భంగా దాత హనుమంతు మాట్లాడుతూ పురాతనమైన ఆలయానికి ప్రతిఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు రఘు, రాజు, రామంజి, వెంకటేష్, పర్శ, నరసప్ప పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


వాహనదారుడికి సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. బుధవారం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలోని చందన షాపింగ్ మాల్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న వాటిని క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా సీఐ వాహనాల రికార్డులను పరిశీలించారు. ప్రతి మోటార్ సైకిల్ వాహనదారుడు హెల్మెట్ వాడాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు.

### 23వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె బుధవారానికి 23వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె 50వ రోజుకు చేరింది. సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, తిప్పన్న, కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఏ ఒక్కరికీ తల్లికి వందనం నిధులు జమ కాలేదన్నారు. ఈ విషయాన్ని కార్మికులు ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర యూనియన్ నాయకులు జేఏసీగా ఏర్పడి అన్ని సంఘాల నాయకులు ఈనెల 27వ తేదీన సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

### మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

గోనెగండ్ల : అక్రమాలకు పాల్పడుతున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఆర్‌యూఎస్‌ఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రఘునాథ్, ఆఫ్రిది డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠలకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి పరీక్షలు నిర్వహించగా అందులో అధిక మార్కులతో పాస్ అయిన విద్యార్థులకు కాకుండా ముడుపులు తీసుకొని తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మిగతా తరగతుల సీట్లను కూడా తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు సీట్లు ఇస్తున్నాన్నారు. అలాగే నాలుగు రోజుల క్రితం ఆరుగురు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయం దాచిపెట్టారన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నవాజ్, ఈరన్న పాల్గొన్నారు.

### రోడ్డుపై కూలిన భారీ వృక్షం


రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

ఆదోని టౌన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ 2వ రోడ్డులోని సాయిభారతి స్కూల్ సమీపంలో భారీ చెట్టు విరిగి రోడ్డుపై పడింది. దీంతో ఆ మార్గం గుండా వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్టు కూలే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీవాసులు పేర్కొన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన

మంత్రాలయం రూరల్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ గోవిందమ్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ జయంతి తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు విత్తన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: కొర్రలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కర్నూలు జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత చిరుధాన్యాల సమన్వయ పథకం కింద ఎంపిక చేసుకున్న రైతులకు కొర్రలు, వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కొర్రలో రైతులకు 51ఏ, 3156, 3159 మహానంది రకాలు అంతర పంటలుగా విత్తుకునేందుకు అనువైనవన్నారు. వీటి పంట కాలం 85–90 రోజులను 11–13 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని చెప్పారు. జూలై 30 వరకు కొర్రను విత్తుకోవచ్చన్నారు. అలాగే నూనె గింజల పథకం ప్రథమ శ్రేణి క్షేత్రాల కింద ఎంపిక చేసుకున్న రైతులకు కదిరి లేపాక్షి వేరుశనగ విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కదిరి వేరుశనగ శాస్త్రవేత్త డాక్టర్ నరసింహులు, శాస్త్రవేత్తలు చైతన్య, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, మాదక ద్రవ్యాల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్ అన్నారు. బుధవారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలైన గుట్కా, సారాయి, గంజాయి, డ్రగ్స్ వంటి వాటి జోలికెళ్లకూడదన్నారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి**

కోసిగి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి అన్నారు. స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవలో భాగంగా అవగహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కల్గే అనార్థలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్, ఇన్‌చార్జి కరస్పాండెంట్ ఫాదర్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాలతో అనర్థాలు**

ఎమ్మిగనూరుటౌన్: మాదకద్రవ్యాలతో అనర్థాలే ఎక్కువ అని స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్ఐ రాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి


రైతులకు సూచనలు తెలియజేస్తున్న ఏడీఏ బాలవర్ధిరాజు, వ్యవసాయ అధికారులు

ఆదోని రూరల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ బాలవర్ధిరాజు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని పర్వతాపురం, కల్లుబావి గ్రామాల్లో ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను కుళ్లింజేసి పంటకు ఎరువులుగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రఘువరన్, పట్టు పరిశ్రమశాఖ అధికారిణి విమలాబాయి, ఆత్మ ఏటీఎం రామాంజిని, ఏఈఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరలోనే ట్రాఫిక్ సమస్యకు చెక్


బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే చెక్ పెడతామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం ఆలూరు రోడ్డు నుంచి ఆస్పరి, ఎమ్మిగనూరుకు వెళ్లేందుకు నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌ను బైపాస్ పనులపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి బయట పడేందుకు సంక్రాంతి లేదా ఉగాది కానుకగా బైపాస్‌ను అందజేస్తానన్నారు. ఆలూరు రోడ్డు నుంచి ఆస్పరి, ఎమ్మిగనూరుకు వెళ్లేందుకు బైపాస్ రోడ్డు 7.303 కి.మీ. వరకు పనులు 70 శాతం పూర్తి అయ్యాయన్నారు. రూ.242 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్ప, నాయకులు మధుసూదన్‌శర్మ, నాగేంద్ర పాల్గొన్నారు.

### డీఈఓకు వినతి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డీఈఓ శామ్యూల్‌పాల్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం ఆదోనిలో పర్యటించిన డీఈఓను కలిసి పలు సమస్యలను వివరించారు.

### రోడ్డు మధ్యలో గుంత


ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రధాన రహదారిలో అన్నా క్యాంటీన్ సమీపంలో రోడ్డు మధ్యలో గుంత ఏర్పడింది. ఎమ్మిగనూరు–బళ్లారి–రాయచూరుకు వెళ్లే బస్సులు, టిప్పర్లు ఓవర్ లోడు లారీలతో పాటు కాలేజ్‌కు వెళ్లే స్కూటర్లు, నిత్యం ఈ మార్గం గుండా తిరుగుతుంటాయి. గుంతను తప్పించే క్రమంలో వాహనదారులు కింద పడిన ఘటనలు కూడా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

### వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల : మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన కురువ రాజోలి రాముడుని అదే గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు రాజోలి రాముడు అదే గ్రామానికి చెందిన బలిజ రంగయ్య పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అయితే ఆ పొలం మేరలో దస్తగిరి అనే వ్యక్తి ఎరువును వేసుకున్నాడు. కొద్ది రోజుల నుంచి దస్తగిరి వేసుకున్న ఎరువును తీసివేయాలని రాముడు చెబుతున్నాడు. అయితే మంగళవారం సాయంత్రం దస్తగిరి ఎరువును తీసివేసేందుకు వచ్చాడు. చాలా రోజుల నుంచి ఎరువును తీయాలని చెప్పుతున్నా తీయడం లేదని రాముడు చెప్పుతుండగా మాటిమాటికి చెప్పుతావా అంటూ దస్తగిరి గడపారతో తలపై కొట్టాడు. దీంతో రాముడు తలకు గాయం కావడంతో ఎమ్మిగనూరు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రాముడు ఫిర్యాదు మేరకు బుధవారం దస్తగిరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మహాయోగి లక్ష్మమ్మవ్వ కాలనీలో టీబీ నిర్మూలన కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గల్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు నాగమ్మ, ఆశావర్కర్లు సౌభాగ్య, ప్రతిభ, నాగవేణి, మీనాక్షి, ప్రజలు పాల్గొన్నారు.

### జూలై 5న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక కోర్టు హాల్‌లో డీఎస్పీ హేమలత, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. జడ్జి మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీవల్లి, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### సరుకులు సక్రమంగా అందించాలి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: మండలంలోని రేషన్‌షాపుల డీలర్లు కార్డుదారులకు రేషన్ సరుకులను సక్రమంగా అందించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రేషన్‌డీలర్లు, రెవెన్యూశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి రేషన్ అందడం లేదని ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్, పౌర సరఫరాల డీటీ రుద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


ఉరుకుందలో పోటెత్తిన భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం భక్తులతో సందడిగా నెలకొంది. బుధవారం అమావాస్య (మణ్ణెత్తిన అమావాస్య, మట్టి ఎద్దుల అమావాస్య) కావడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అమావాస్య సందర్భంగా చేపట్టిన లక్ష పుష్పార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. అలాగే ఉరుకుందకు సమీపంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించుకున్నారు.

**రామలింగేశ్వరస్వామి ఆలయంలో..**

తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

**ఆలయాల్లో అమావాస్య పూజలు**

నందవరం : దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు గావించారు. అలాగే నందవరంలోని బంగారమ్మవ్వ దేవాలయం, భీరప్ప స్వామి ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది.

**ఘనంగా మట్టి ఎద్దుగా అమావాస్య**

గోనెగండ్ల : మండలంలో మట్టి ఎద్దుల అమావాస్యను బుధవారం రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు మట్టితో ఎద్దులను తయారు చేసి ఇంట్లో కొలువుంచి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

**ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ..**

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో బుధవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివి ధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.

## కార్మికులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం గత 50 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షకు వారు సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని కార్మికులకు వడ్డించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకై అహర్నిషలు కష్టపడే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి సంక్షేమ పథకాలు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలకంఠ, పార్టీ నాయకులు సోమేష్, చంద్రశేఖర్, కరె రాము, కడివెళ్ల ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

### వెలిగిన వీధి దీపాలు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత 50 రోజులుగా సమ్మె చేస్తున్న కారణంగా వీధి లైట్లు వెలుగక గాఢాంధకారంలో మునిగిన పట్టణంలో బుధవారం మున్సిపల్ అధికారులు విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో వీధి దీపాలు వెలిగించారు. సమ్మె చేస్తున్న కార్మికులను బుధవారం చైర్మన్ కేఎస్ రఘుతో పాటు వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు పలకడంతో అధికార పార్టీ నుంచి మున్సిపల్ అధికారులపై ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. దీంతో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించి ఆశాఖ సిబ్బందితో రాత్రి వీధి దీపాలను వెలిగింపజేశారు. ఇందిలా ఉండగా వీధి దీపాల వెలిగింపుపై మున్సిపల్ కార్మి కులు దీక్ష శిబిరంలో సెల్‌ఫోన్ లైట్లు వెలిగించి నిరసన తెలియజేశారు. అయితే వీధి దీపాల వెలిగింపునకు అడ్డుపడవద్దని కార్మికులను పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది.

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


నాగలదిన్నెలో విత్తన దుకాణంలో విత్తనాలను తనిఖీ చేస్తున్న ఏఓ సరిత

నందవరం : రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిణి సరిత హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో కోరమాండల్, శివ కిరణ్ ట్రేడర్స్ తదితర షాపులను తనిఖీ చేశారు. అలాగే నేదికైరవాడి గ్రామంలో రైతు సేవా కేంద్రాలన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శ్రీనివాసులు, వీహెచ్ఏ పాల్గొన్నారు.

### వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

నందవరం : 65ఏళ్ల పైబడిన వారికి గురువారం నుంచి ఇంటి వద్దకే రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శశిశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: కార్డుదారులకు రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. అధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. 65 సంవత్సరాలుపై బడిన వారి ఇంటికి వెళ్లి డీలర్లు నిత్యవసర సరుకులు పంపిణీ చేయా లన్నారు. టీడీలు వీరభద్రగౌడ్, వలిబాషా, చంద్రకళ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కౌన్సిలర్ చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: పట్టణంలోని ఇంద్రానగర్ ఎరుకల కాలనీలో నివసిస్తున్న మారేష్, భారతి దంపతుల కుమారుడు అభిరామ్(7) మంగళవారం పాము కాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆ ఏరియాలో ఉన్న కౌన్సిలర్ చలపతికి ఫోన్ చేసి వెంటనే బాధితా కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. దీంతో కౌన్సిలర్ చలపతి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. ఆయన వెంట ఎరువుల నగేష్, ఆటో లక్ష్మన్న, బైలర్ నాగరాజు, జోలాపురం రాజు, మనీ, బండెప్ప, ఉప్పరి నారాయణ తదితరులు ఉన్నారు.